దావోస్‌లో జరుగుతున్న డబ్ల్యూఈఎఫ్ సదస్సులో పలువురు కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రాష్ట్రంలో 'యూనిలివర్' పెట్టుబడి

కామారెడ్డిలో పామాయిల్, సీసా మూతల యూనిట్ల ఏర్పాటు

ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ 'యూనిలివర్' తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. కామారెడ్డిలో పామాయిల్ తయారీ, రిఫైనింగ్ యూనిట్‌తో పాటు బాటిల్ క్యాప్‌ల (సీసా మూతల) తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచ వాణిజ్య వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచ ప్రఖ్యాతి పేరొందిన 'యూనిలివర్' మన దేశంలో హిందుస్థాన్ యూనిలివర్ పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్న విషయం తెలిసిందే. 'యూనిలివర్' గ్లోబల్ సీఈవో హీన్ షూమేకర్‌తోపాటు ఆ కంపెనీ చీఫ్ సప్లైచైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి జరిపిన చర్చల అనంతరం ఈ ఒప్పందం ఖరారైనట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

స్కైరూట్ రూ.500 కోట్ల పెట్టుబడి

డబ్ల్యూఈఎఫ్ సదస్సులో పాల్గొంటున్న సీఎం రేవంత్‌రెడ్డి బృందం మంగళవారం తెలంగాణ పెవిలియన్‌లో వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ యూనిట్ ఏర్పాటుకు 'స్కైరూట్' కంపెనీ ముందుకొచ్చింది. రూ.500 కోట్ల పెట్టుబడితో ఈ యూనిట్‌ను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నది. సప్లయ్ చైన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్నోవేషన్ రంగాల్లో ఖ్యాతి పొందిన 'ఎజిలిటీ లాజిస్టిక్స్' కంపెనీ వైఎస్ చైర్మన్ తారెక్ సుల్తాన్‌తో రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు భేటీ అయ్యారు.

మార్కెట్‌కు ట్రంప్ సెగ



ముంబై, జనవరి 21: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలకు లోనయ్యాయి. ఉదయం ఆరంభంలో లాభాల్లో కదలాడినా.. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకున్నాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,235.08 పాయింట్లు లేదా 1.60 శాతం కోల్పోయి 75,838.36 వద్ద ముగిసింది. ఒకానొక దశలోనైతే 1,431.57 పాయింట్లు పడిపోయింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 320.10 పాయింట్లు లేదా 1.37 శాతం దిగజారి 23,024.65 వద్ద స్థిరపడింది. గత ఏడాది జూన్ 6 తర్వాత ఈ స్థాయికి సూచీ రావడం ఇదే తొలిసారి. కాగా, ఇంట్రా-డేలో నైతే 367.90 పాయింట్లు పతనమైంది.

ఇదీ సంగతి..

అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మళ్లీ వాణిజ్య యుద్ధానికి తెరతీస్తారన్న అంచనాలు మార్కెట్ సెంటిమెంట్‌ను ఒక్కసారిగా దెబ్బతీశాయి. అగ్రరాజ్య రక్షణాత్మక ధోరణులతో ఇతర దేశాల ఆర్థికావకాశాలు క్షీణిస్తాయన్న భయాందోళనలు మదుపరుల్లోనూ చెలరేగాయి. ఫలితంగా స్టాక్ మార్కెట్లలో అలజడి చోటుచేసుకున్నది. నిజానికి ఎన్నికల ప్రచారంలోనే పొరుగు దేశాల నుంచి తమ దేశంలోకి దిగుమతయ్యే వస్తూత్పత్తులపై సుంకాలను 10 నుంచి 20 శాతం విధిస్తామని, చైనా నుంచి వస్తున్నవాటికైతే టారీఫ్‌లు 60 శాతంగా ఉంటాయని ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. గతంలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడూ ట్రంప్.. సుంకాల సమరానికి కాలు దువ్విన సంగతి విదితమే. ఈ క్రమంలో ఇప్పుడూ అదే సంకేతాలు వస్తున్నాయి. వచ్చే నెల మొదలు కెనడా, మెక్సికోల నుంచి జరిగే దిగుమతులపై దాదాపు 25 శాతం సుంకాలు విధించే యోచనలో ఉన్నామని ట్రంప్ సోమవారం ప్రకటించారు. ఆ రెండు దేశాల నుంచి అమెరికాలోకి పెద్ద ఎత్తున అక్రమ వలసలు జరుగుతున్నాయని, నార్కోటిక్స్ వస్తున్నాయని ట్రంప్ ఆరోపిస్తున్నారు. వీటిని అరికట్టేందుకే సుంకాలను పెంచాలని చూస్తున్నట్టు చెప్పారు. మున్ముందు ఇతర దేశాలపైనా ట్రంప్ ఇదే దుందుడుకు వైఖరి ఉంటుందన్న అంచనాలొస్తున్నాయి.

రంగాలవారీగా..

రియల్టీ రంగ షేర్లు గరిష్ఠంగా 4.22 శాతం నష్టపోయాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్ 3.99 శాతం, సర్వీసెస్ 2.86 శాతం, పవర్ 2.63 శాతం, టెలికం 2.52 శాతం చొప్పున తగ్గాయి. జొమాటో షేర్ విలువ అత్యధికంగా 10.92 శాతం పడిపోగా.. ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, రిలయన్స్ ఇండస్ట్రీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ షేర్లూ పతనమయ్యాయి. ఇక ఆసియా మార్కెట్లలో జపాన్, హాంకాంగ్ సూచీలు లాభపడగా.. చైనా, దక్షిణ కొరియా ఇండెక్స్‌లు నష్టపోయాయి. కాగా, విదేశీ సంస్థాగత మదుపరులు ఒక్కరోజే రూ.5,920 కోట్ల పెట్టుబడుల్ని వెనక్కి తీసుకున్నట్టు స్టాక్ ఎక్స్ఛేంజ్ గణాంకాలు చెప్తున్నాయి.

మార్కెట్ విలువ డౌన్

స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలతో ఆయా కంపెనీల మార్కెట్ విలువ కూడా అదే రీతిలో క్షీణించింది. ఈ ఒక్కరోజే మదుపరుల సంపద రూ.7.52 లక్షల కోట్లు ఆవిరైపోయింది. బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ. 7,52,520.34 కోట్లు తరిగిపోయి రూ.4,24,07, 205.81 కోట్లు లేదా 4.90 ట్రిలియన్ డాలర్లకు పరిమితమైంది. బీఎస్ఈలో మొత్తం 4,088 షేర్లు ట్రేడ్ అవగా, 2,881 షేర్లు నష్టపోయాయి. మిడ్ క్యాప్ 2 శాతం, స్మాల్ క్యాప్ 1.94 శాతం చొప్పున నిరాశపర్చాయి.

నష్టాలకు ప్రధాన కారణాలు

- అమ్మకాల ఒత్తిడిలో మదుపరులు
- వాణిజ్య యుద్ధం దిశగా ట్రంప్ అడుగులు
- అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చిత వాతావరణం
- భారత్ నుంచి తరలిపోతున్న విదేశీ సంస్థాగత పెట్టుబడులు
- డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనం

ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్!

పరిచయం చేసే యోచనలో సెబీ • గ్రే మార్కెట్ కార్యకలాపాలకు చెక్ పెట్టడానికే

ముంబై, జనవరి 21: గ్రే మార్కెట్ కార్యకలాపాల నిరోధానికి ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్‌ను పరిచయం చేసే యోచనలో మార్కెట్ రెగ్యులేటర్ సెబీ ఉన్నది. ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో)లో కేటాయించిన షేర్లను ఇన్వెస్టర్లు వెంటనే అమ్ముకునేలా ఓ వ్యవస్థను తీసుకురావాలనుకుంటున్నట్టు సెబీ చైర్‌పర్సన్ మదాబీ పురీ బచ్ మంగళవారం ఇక్కడ తెలిపారు. తద్వారా గ్రే మార్కెట్ కార్యకలాపాలకు చెక్ పెట్టాలని చూస్తున్నట్టు చెప్పారు. రెండు అగ్రశ్రేణి ప్రాక్సీ అడ్వైజరీ సంస్థలు ఈ పనిలోనే నిమగ్నమయ్యాయని, త్వరలోనే ఓ పోర్టల్ ప్రారంభం కావచ్చన్నారు. సదరు లావాదేవీలన్నీ ఇందులో నిక్షిప్తమవుతాయని, కంపెనీల్లో పాలనాపరమైన ప్రమాణాలను నిర్వహించడంలోనూ ఇది దోహదపడగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

సెబీ ఏం చేస్తున్నదంటే..

ఇటీవలికాలంలో దేశీయ స్టాక్ మార్కెట్లలోకి పెద్ద ఎత్తున ఐపీవోలు వస్తున్న విషయం తెలిసిందే. అలాగే లిస్టింగ్ రోజున భారీ లాభాలనూ నమోదు చేస్తున్న సంగతీ విదితమే. కానీ దీనికి కారణం గ్రే మార్కెట్ కార్యకలాపాలేనని సెబీ అంటున్నది. ఐపీవో ముగిసిన దగ్గర్నుంచి షేర్లు స్టాక్ మార్కెట్లలో నమోదు కావడానికి మధ్య ప్రస్తుతం 3 రోజుల విరామం ఉంటున్నది. ఈ సమయంలో ఇన్వెస్టర్లు, ఆథరైజ్డ్ కాని డీలర్ల నడుమ అనధికార, నియంత్రణలేని క్రయవిక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటినే గ్రే మార్కెట్ కార్యకలాపాలుగా పేర్కొంటున్నారు. అందుకే అనధికారికంగా జరుగుతున్న ఈ లావాదేవీలకు.. మదుపరులు కోరుకుంటే సక్రమ రీతిలో ఎందుకు జరుగడానికి అవకాశం ఇవ్వొద్దని ఆలోచించామని బచ్ చెప్తున్నారు. ఐపీవోలో షేర్ల కేటాయింపు జరిగిందంటే అది లీగలేనని, వాటిని అమ్ముకునే హక్కు కొన్నవారికి ఉంటుందని చెప్పారు. అందులో భాగంగానే ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్‌కు అనుమతిచ్చే దిశగా వెళ్తున్నట్టు తెలిపారు.

బ్రాండ్లలో మేటి.. భారతీయ ఐటీ

అత్యంత విలువైన సంస్థల్లో టీసీఎస్, ఇన్ఫీ, హెచ్‌సీఎల్

బ్రాండ్ ఫైనాన్స్ తాజా నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ, జనవరి 21: దేశీయ ఐటీ దిగ్గజాలు అంతర్జాతీయ స్థాయిలో మరోసారి సత్తాచాటాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యంత విలువైన సంస్థల జాబితాలో ఐదు సంస్థలు చోటు దక్కించుకున్నాయి. వీటిలో టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, టెక్ మహీంద్రాలు ఉన్నాయని బ్రాండ్ ఫైనాన్స్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అంతర్జాతీయంగా టాప్-10 విలువైన సంస్థల్లో అమెరికా ఎప్పటిలాగే 40 శాతంతో తొలిస్థానంలో నిలిచింది. 36 శాతం వాటాతో భారత్ ఆ తర్వాతి స్థానంలో నిలిచినట్లు వెల్లడించింది. యూఎస్ టెక్నాలజీ దిగ్గజం యాక్సెంచర్ వరుసగా ఏడోసారి అత్యంత విలువైన సంస్థగా తన స్థానాన్ని కొనసాగించింది. దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 21.3 బిలియన్ డాలర్ల బ్రాండ్ విలువ(11 శాతం ఎగబాకింది)తో రెండో స్థానం దక్కించుకున్నది. వరుసగా నాలుగోసారి ఈ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. మరోవైపు, 2025లో అత్యంతవేగవంతమైన ఐటీ సర్వీసుల బ్రాండ్‌గా హెచ్‌సీఎల్ టెక్నాలజీ అవతరించిందని పేర్కొంది. గడిచిన ఐదేండ్లుగా తొలిస్థానంలో ఉన్న ఇన్ఫోసిస్‌ను వెనక్కినెట్టి హెచ్‌సీఎల్ ఈ స్థానాన్ని దక్కించుకున్నదని బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మొత్తం ఐటీ విలువల్లో 36 శాతం వాటాతో భారత్ రెండోస్థానంలో కొనసాగుతున్నది. గత కొన్నేండ్లుగా నిరాశాజనక పనితీరు కనబరిచిన అమెరికా మార్కెట్ తిరిగి పుంజుకోవడం దేశీయ ఐటీ సంస్థలకు కలిసొచ్చిందని, ముఖ్యంగా నూతన ఆర్డర్లు రావడంతో దేశీయ ఐటీ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంది. మూడోస్థానంలో నిలిచిన ఇన్ఫోసిస్ బ్రాండ్ విలువ 15 శాతం ఎగబాకి 16.3 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. ఇదే స్థానంలో కొనసాగడం వరుసగా నాలుగోసారి. ఇన్ఫోసిస్ సీఈవో పరేఖ్ నాయకత్వంలో సంస్థ అన్ని విభాగాల్లో రాణిస్తున్నదని, పనితీరు మెరుగుపడటంతోపాటు ఇన్నోవేషన్‌లో దూసుకుపోతున్నదని పేర్కొంది. అలాగే హెచ్‌సీఎల్ టెక్నాలజీ బ్రాండ్ విలువ 17 శాతం ఎగబాకి 8.9 బిలియన్ డాలర్లకు చేరుకోగా, విప్రో విలువ 6 బిలియన్ డాలర్లు కాగా, టెక్ మహీంద్రా కూడా టాప్-10లో చోటు దక్కించుకున్నాయి. అలాగే టాప్-25 గ్లోబల్ ర్యాకింగ్ సంస్థల్లో తొలిసారిగా హెక్సావేర్ టెక్నాలజీ ప్రవేశించింది.

హెచ్‌సీఎల్ టెక్ విస్తరణ

హైదరాబాద్, జనవరి 21: హెచ్‌సీఎల్ టెక్నాలజీ..హైదరాబాద్‌లో నూతన సెంటర్‌ను ప్రారంభించింది. అంతర్జాతీయ క్లయింట్లకు కృత్రిమ మేధస్సు, డిజిటల్ ట్రాన్స్‌మిషన్ సొల్యూషన్స్ సేవలు అందించాలనే ఉద్దేశంతో నగరంలో కొత్తగా సెంటర్‌ను ఆరంభించినట్లు కంపెనీ సీఈవో, ఎండీ సీ విజయకుమార్ తెలిపారు. హై-టెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 5 వేల మంది కూర్చోవడానికి వీలుంటుందన్నారు.

విప్రో కన్స్యూమర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్

హైదరాబాద్, జనవరి 21: విప్రో అనుబంధ సంస్థయైన విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ సంస్థ..హైదరాబాద్‌లో ఐవోటీ ఆధారిత ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. రాష్ట్రంలో అత్యాధునిక లైటింగ్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ సెంటర్‌ను నెలకొల్పినట్లు, దేశంలో ఇది రెండో సెంటర్‌ని కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ అనూజ్ ధీర్ తెలిపారు.

వణికించిన జనవరి..

ఐదేండ్లలో రికార్డు చలి..

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఐదేండ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి జనవరిలో చలి పెరిగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో 6, సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో7, మొహినాబాద్‌లో 7.6, ఆదిలాబాద్ జిల్లా బేలలో 7.8, నిర్మల్ జిల్లా పెంబిలో 8.6, వికారాబాద్ జిల్లా మార్పల్లిలో 8.6, కామారెడ్డి జిల్లా జుక్కల్‌లో 8.8, సిరిసిల్ల జిల్లా గంభీరావ్‌పేటలో 9.1, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లామేడ్చల్‌లో 9.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ట్రాన్స్‌కోకు 2000 కోట్లు

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): టీజీ ట్రాన్స్‌కోకు 2000 కోట్లు మంజూరుచేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. డిస్కమ్‌ల నిర్వహణకు ఈ మొత్తం కేటాయించింది.

25న జాతీయ ఓటర్ల దినోత్సవం

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నట్టు సీఈవో సుదర్శన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఉత్సవాలకు హాజరు కావాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆహ్వానం పలికారు.

ప్రజావాణికి 5,736 దరఖాస్తులు

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో 5736 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. పంచాయతీరాజ్‌కు 132, విద్యుత్‌కు 131, రెవెన్యూ సమస్యలకు 43, ప్రవాసీ ప్రజావాణికి 1, ఇందిరమ్మ ఇండ్ల కోసం 5332 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి 97 అందాయని వెల్లడించారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై మాధవీలత ఫిర్యాదు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 21 (నమస్తే తెలంగాణ): మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ నాయకుడు జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకురాలు మాధవీలత మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతికి ఫిర్యాదు చేశారు. తన మనోభావాలు దెబ్బతినే విధంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పటాన్‌చెరు ఎమ్మెల్యేకు నిరసన సెగ

- గోబ్యాక్, డౌన్ డౌన్ అంటూ నినాదాలు
- బొల్లారంలో సొంత పార్టీ నాయకుల నుంచే నిరసనలు

జిన్నారం (బొల్లారం) జనవరి 21: సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపల్ పరిధిలో మంగళవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి సొంత పార్టీ నాయకులనుంచి నిరసన సెగ తగిలింది. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాన్ని ఏడో వార్డు నుంచి ప్రారంభించిన ఎమ్మెల్యేను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డితో కలిసి అడ్డుకున్నారు. జిల్లాకు చెందిన మంత్రి దామోదర రాజనర్సింహ చేయాల్సిన పనులను ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. శిలాఫలకాలపై చైర్‌పర్సన్ భర్త పేరును పెట్టడంపై ఆక్షేపించారు. దీంతో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. నాయకులను అడ్డుకోబోయిన పోలీసులను ఎమ్మెల్యే వారించారు. బీఆర్ఎస్ నాయకులకు ఎమ్మెల్యే మహిపాల్ వత్తాసు పలుకుతున్నారని కాంగ్రెస్ శ్రేణులు విమర్శించాయి.

సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపల్ పరిధిలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని అడ్డుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు

- సీపీఎం పాలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు
- పీఎన్ఎం రూపొందించిన పాటల సీడీ ఆవిష్కరణ

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ప్రజా సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు చేస్తామని, అందుకు ప్రజలను ఐక్యం చేసేందుకు సమాయత్తమవుతున్నామని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు తెలిపారు. ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరుగనున్న సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలకు సంబంధించి ప్రజానాట్య మండలి(పీఎన్ఎం) రూపొందించిన పాటల సీడీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో ప్రమాదకర రాజకీయ పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. దేశంలో మతోన్మాద భావాలు ప్రజ్వరిల్లుతున్నాయని, వాటిని బీజేపీ, ఆర్ఎస్ఎస్, సంఘ్‌పరివార్ వ్యాపింపజేస్తున్నాయని ఆరోపించారు. వీరోచిత పోరాటానికి తెలంగాణ ప్రజలు ప్రతీక అని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని నిర్వహించిన గొప్ప సంప్రదాయం ఇక్కడే ఉన్నదని గుర్తుచేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జీ నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, చుక్క రాములు, టీ జ్యోతి, డీజీ నరసింహారావు, పీఎన్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ, ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, మారన్న పాల్గొన్నారు.

అక్కన్నపేట రైల్వేస్టేషన్ విద్యుద్దీకరణ ట్రయల్‌రన్‌లో పాల్గొన్న అధికారులు

'మెదక్-అక్కన్నపేట' విద్యుదీకరణ ట్రయల్‌రన్ సక్సెస్

మెదక్, జనవరి 21(నమస్తేతెలంగాణ) : మెదక్-అక్కన్నపేట మధ్య రూ.15.49 కోట్లతో నిర్మించిన 17.2 కిలోమీటర్ల రైల్వే విద్యుదీకరణ ట్రయల్‌రన్ పనులు విజయవంతమయ్యాయి. మంగళవారం అక్కన్నపేటలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపాల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ బ్రిజ్ మోహన్ మీనా జెండా ఊపి ట్రయల్‌రన్‌ను ప్రారంభించారు. విద్యుత్ ఇంజిన్‌తో అక్కన్నపేట-మెదక్ 17.2 కిలోమీటర్ల విద్యుదీకరణ ట్రయల్‌రన్‌నను తనిఖీ చేశారు. అక్కనపేట లైన్ విద్యుద్దీకరణతో హైదరాబాద్ డివిజన్‌లో 94శాతం విద్యుద్దీకరణ పూర్తయినట్టు తెలిపారు. దీంతో కాలుష్యం తగ్గడంతోపాటు అదనపు రైళ్లు నడపడానికి అవకాశం ఏర్పడిందని చెప్పారు. మనోహరాబాద్ నుంచి సిద్దిపేటకు కొత్తగా నిర్మించిన రైల్వే మార్గంలో విద్యుదీకరణ పనులు చేపడతామని తెలిపారు. మేడ్చల్ నుంచి మెదక్ జిల్లా మీదుగా మహారాష్ట్రలోని ముథ్కేడ్ వరకు 251 కిలోమీటర్లు డబ్లింగ్ పనులు మంజూరైనట్టు వెల్లడించారు.

విద్యార్థులపై నిఘా

డ్రగ్స్‌కు అలవాటు పడకుండా చర్యలు: టీజీన్యాబ్

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణను డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు యాంటీ నార్కోటిక్ బ్యూరో అధికారులు వినూత్న పద్ధతులు అవలంబిస్తున్నారు. విద్యాశాఖ సహకారంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 22 వేల ప్రత్యేక క్లబ్‌లను (ప్రహరీ క్లబ్‌లు) ఏర్పాటు చేసినట్టు టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటుపడే అవకాశమున్న విషయాన్ని ఈ క్లబ్‌ల ద్వారా గుర్తిస్తామని వెల్లడించారు. వెంటనే ఇద్దరు డీఎస్సీలు, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బందితో కూడిన టీం ఆయా పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పిస్తుందని చెప్పారు. ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నట్టు, అమ్ముతున్నట్టు తెలిస్తే యాంటీ నార్కోటిక్ బ్యూరో టోల్ ఫ్రీ నంబర్ 1908కి లేదా కంట్రోల్ రూమ్ నంబర్ 8712671111కు లేదా tsnabho hyd @tspolice. gov.inకు మెయిల్ ద్వారా తెలియజేయాలని సందీప్ శాండిల్య సూచించారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, సరైన సమాచారం ఇచ్చిన వారికి తగిన పారితోషికం కూడా ఇస్తామని ప్రకటించారు.

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

ఎస్సీల వర్గీకరణకు అన్ని వర్గాల మద్దతు

- అగ్రవర్ణాల్లోని పేదల కోసం కూడా పోరాడుతాం: కృష్ణ మాదిగ

ఖైరతాబాద్, జనవరి 21: ఎస్సీల వర్గీకరణకు సమాజంలోని అన్ని వర్గాలు మద్దతు తెలుపుతున్నాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ చెప్పారు. ఎస్సీల వర్గీకరణకు మద్దతుగా మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రెడ్డి జాగృతి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సులో మంద కృష్ణ మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డులో నిర్వహించే లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల కార్యక్రమానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాలు సంఘీభావం తెలిపినట్టు వెల్లడించారు. షెడ్యూల్డ్ కులాల్లో తక్కువ జనాభా ఉన్న ఓ వర్గం ఎస్సీ వర్గీకరణకు అడ్డుతగులుతున్నదని, దశాబ్దాలుగా రిజర్వేషన్ల ఫలాలు వారే అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. దళితులు, గిరిజనులు, బీసీ వర్గాల కోసమే కాకుండా అగ్రవర్ణాల్లో ఉన్న పేదల అభ్యున్నతి కోసం కూడా ఎమ్మార్పీఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. నాయకులు పాల్గొన్నారు.

WATCH & ENJOY RELOADED VERSION IN THEATRES
మల్టిప్లెక్స్ టికెట్ ధర : ~~295~~/- 150/-, ~~350~~/- 200/-
సింగిల్ స్క్రీన్స్ టికెట్ ధర : 112/-, 90/-, 55/-,

సంధ్య 70 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 10.00,2.00,6.00,10.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
MYTHRI విమల్ 70 - బాలానగర్ 8.00AM 64 Channel Dolby Atmos 4k Laser Projection Centrally Air Conditiond
MYTHRI రాజధాని 70- దిల్‌సుఖ్‌నగర్ 10.30,2.30,6.30,10.30
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్
PVR నెక్టస్ మాల్ - కూకట్‌పల్లి
PVR గలేరియా - పంజాగుట్ట
PVR పివిఆర్ - ఎర్రమంజిల్
PVR పివిఆర్ - మూసారంబాగ్
PVR ఐకాన్ - హైటెక్ సిటీ
PVR ATRIUM మాల్ -గచ్చిబౌలి
INOX బి.ఎస్.